దిష్టిబొమ్మల్లా సీసీ కెమెరాలు



సదాశివనగర్ జీపీ కార్యాలయం వద్ద నేలపై పడ్డ సీసీ కెమెరాల బాక్స్





తిర్మన్‌పల్లి, భూంపల్లిలో నిరుపయోగంగా మారిన కెమెరాలు

- కొన్ని నెలలుగా పని చేయని వైనం
- కొరవడిన పోలీసుల పర్యవేక్షణ
- నిరుపయోగంగా మానిటర్లు
- రూ.లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రతి గ్రామంలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం.. గ్రామస్తులంతా ఏకమై గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద తమ సొంత డబ్బులతో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గతంలో పోలీస్ శాఖ ఇచ్చిన పిలుపు మేరకు దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ సీసీ కెమెరాలు కొద్ది రోజులు మాత్రమే పని చేయడం వల్ల లక్ష్యం నీరుగారిపోయింది. సీసీ కెమెరాల గురించి పోలీసుల పర్యవేక్షణ లేదనే విషయం స్పష్టమవుతోంది. గతంలో గ్రామ గ్రామానికి ఒక పోలీస్ అధికారిని నియమించి ఆ గ్రామ బాధ్యతలను వారికి అప్పగించారు. కానీ ఆ గ్రామ పోలీస్ వ్యవస్థ కూడా సక్రమంగా పని చేయడం లేదనే విషయం తేటతెల్లమవుతోంది. గ్రామాల్లో దొంగతనాల బెడదను నివారించడానికి ఏడాది క్రితం 11 గ్రామాల్లో ఏర్పాటు చేసిన 98 సీసీ కెమెరాలు పనికి రాకుండా పోయాయి. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అనే మాట ప్రజల నోట వినబడడం లేదు. సదాశివనగర్ మండల కేంద్రంలో 24 సీసీ కెమెరాలను సుమారు రూ.3 లక్షలతో గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేశారు. అలాగే అడ్లూర్ ఎల్లారెడ్డిలో 8, తిర్మన్‌పల్లి, తుక్కోజివాడిలో 4 చొప్పున, పద్మాజీవాడిలో 12, మోడెగాంలో 6, మర్కల్‌లో 4, లింగంపల్లిలో 12, కుప్రియాల్‌లో 8, ధర్మారావ్‌పేట్‌లో 4, భూంపల్లిలో 12 చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఆర్భాటంగా ఏర్పాటు..

గ్రామాల్లో ఎంత ఆర్భాటంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారో అంత ఆర్భాటం ప్రస్తుతం కనిపించడం లేదు. గ్రామాల్లో ఏదైనా గొడవలు తలెత్తినప్పుడు మాత్రమే సీసీ కెమెరాల విషయం గుర్తుకు వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాల్సిన అవసరం ఉంది.

డబ్బులు వృథా అయ్యాయి

గ్రామంలో హడావిడిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింన్రు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తలా ఇంత డబ్బులు సేకరించాం. అయినా ఏం ప్రయోజనం. దిష్టిబొమ్మల్లా ఉంటున్నాయ్. వాటిని ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

– సుధాకర్ రెడ్డి, తిర్మన్‌పల్లి

పోలీసులు పట్టించుకోవాలి

దాతల ద్వారా సీసీ కెమెరాలను పెట్టించాం కానీ ఆ సంతోషం కొద్ది రోజులు మాత్రమే చూసినం.సీసీ కెమెరాలు పని చేసినన్ని రోజులు గ్రా మంలో కొంత భయం అనేది ఉండె. ఇప్పుడు ఆ ప రిస్థితి లేకుండా పోయింది.పోలీసులు దృష్టి పెట్టి వాటిని ఉపయోగంలోకి తేవాలి.

–సంగెం కాశీనాథ్, భూంపల్లి

ఉపయోగంలోకి తెస్తాం

సీసీ కెమెరాలు అక్కడక్కడ పని చేయడం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. గ్రామాల్లో ఏదైనా అనుకోని ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు కీలకం అవుతాయి. నిర్లక్ష్యం చేయకుండా దృష్టి సారిస్తాం.

–రంజిత్, ఎస్సై, సదాశివనగర్

‘తెలంగాణ ఉద్యమానికి తోడ్పాటు అందించారు’



నివాళి అర్పిస్తున్న మలిదశ ఉద్యమకారులు

బాన్సువాడ రూరల్: ఇటీవల మరణించిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి డాక్టర్ బాపురెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఎంతో తోడ్పాటు అందించారని ఆయన అభిమానులు గుర్తు చేసుకున్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చిత్రపటానికి నివాళి అర్పించి ఆయనను స్మరించుకుంటూ సంతాప సభ నిర్వహించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారులు కొత్తకొండ భాస్కర్, డా.బాబు సింధే, మజీద్, మాధవ్ యాదవ్, స్వరూప, కాల్వ శ్యాం, ఉడుత గంగాధర్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌లో యోగాసనాలను చేర్చాలి



వినతి పత్రం అందజేస్తున్న రామిరెడ్డి తదితరులు

కామారెడ్డి అర్బన్: సీఎం కప్ పోటీల్లో యోగాసనాలను చేర్చి యోగాకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) డిప్యూటీ డైరెక్టర్ రవీందర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రామిరెడ్డి తెలిపారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కృపాకర్, రాష్ట్ర ప్రతినిధులు సూర్యప్రకాష్, సత్యనారాయణలతో కలిసి సోమవారం హైదరాబాద్ సాట్ డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసి యోగ ప్రాముఖ్యతను వివరించినట్లు రామిరెడ్డి పేర్కొన్నారు.

రోడ్డును బాగు చేయించండి సారూ..!



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రధాన రహదారి నుండి లింగంపల్లికలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డు కొంత భాగం ధ్వంసమైందని, బాగుచేయాలని కోరుతూ లింగంపల్లికలాన్ గ్రామ రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం ప్రారంభమైన క్రమంలో లారీలు వచ్చి పోయేందుకు కుంగిన రోడ్డు వల్ల ఇబ్బందవుతుందన్నారు. రోడ్డును బాగుచేసి తమ ధాన్యం తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలి



మేనిఫెస్టో పత్రాలను చూపుతున్న పడాల రవీందర్ తదితరులు

కామారెడ్డి రూరల్: ఉమ్మడి జిల్లాలోని గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ముందుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలనుకుంటున్న పడాల రవీందర్ సూచించారు. సోమవారం ఆయన కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆదిలాబాదు-కరీంనగర్-నిజామాబాద్-మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేస్తామన్న ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం బలపరిచిన అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రాములు, చిరంజీవి, కాళిదాస్, లింగం, శ్రీనివాస్, శైలజ, మాధవి, భక్తమాల, మాధవి, సాయిరెడ్డి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ వితరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజిపేటతండాకు చెందిన విద్యార్థుల(అండర్–14) కు సోమవారం తండావాసి బానోత్ నరేష్ రెండు వాలీబాల్స్, నెట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తండాకు చెందిన విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడా పరికరాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్దార్‌సింగ్, అశోక్, గణేష్, రాహుల్, మహేష్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ అధ్యక్షుడి ఎన్నిక



నరేందర్



వెంకటేష్

మాచారెడ్డి: మాచారెడ్డి మండల టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేందర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ గణన చేయడానికి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మాత్రమే నియమించవద్దన్నారు. అన్ని కేడర్ల ఉపాధ్యాయులను పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం పూట సర్వే చేయడం వల్ల కుటుంబాలు అందుబాటులో లేక సర్వే నీరుగారిపోయే ప్రమాదముందన్నారు.

నూతన రేషన్ షాప్ ప్రారంభం

రాజంపేట: రాజంపేటలో నూతనంగా రేషన్ షాప్‌ను సోమవారం స్థానిక రేషన్ షాప్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు కలిసి ప్రారంభించారు. దుబ్బని నితీషకు మంజూరైన రేషన్ షాప్‌ను జిల్లా రేషన్ షాప్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ సోమవారం ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు ముత్యపు సిద్ధిరాములు, ముంతాజ్ అలీ పాల్గొన్నారు

అనారోగ్యంతో రిటైర్డు హెచ్‌ఎం మృతి



మోహన్‌రెడ్డి(ఫైల్)

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం ఇటిక్యాల మోహన్ రెడ్డి (82) సోమవారం మృతి చెందారు. ఆయన రెండున్నర నెలల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను హైదరాబాద్‌లో నిర్వహించారు. అంత్యక్రియలను పెద్దమల్లారెడ్డితో పాటు భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన వారితో పాటు రిటైర్డు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

‘అవర్లీబేస్డ్ విధానం వల్ల నష్టపోతున్నాం’



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు.అందుబాటులో ఉన్న కోర్సులు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా గెస్ట్ లెక్చరర్లు ఎమ్మెల్యేను కలిసి తాము సెలవులు, పరీక్షలు ఉన్నప్పుడు అవర్లీబేస్డ్ విధానం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కన్సాలిడేటెడ్ వేతనం ఇప్పించాలని వినతి పత్రం ద్వారా కోరారు. ఆయన ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేనతో ఫోన్‌లో మాట్లాడగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, భీమయ్య, వినోషన్, మనోహర్, అనిల్, లాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవాల్లో బీబీపేట విద్యార్థులు



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

బీబీపేట: హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ అండ్ రీసోర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవాల్లో మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల చెందిన 9వ తరగతి విద్యార్థిని పూర్ణచందన కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించగా 10వ తరగతి చెందిన ఒల్లెల రేణుక సాంప్రదాయ కథాకథనం విభాగంలో భాగంగా హరికథా గానం చేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రాధిక గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. అంతే కాకుండా ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు 10వ తరగతి విద్యార్థిని తుమ్మ అక్షయ ఎంపికయ్యారు. ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతులను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న ఆదర్శ రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఆదర్శ రైతులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పలువురు ఆదర్శ రైతులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతుల మండల అధ్యక్షుడు బాలయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో పని చేసిన ఆదర్శ రైతులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ చైర్మన్ కోదండరాంను రాష్ట్ర నాయకులు కలిసి కోరినట్లు తెలిపారు. త్వరలోనే ఆదర్శ రైతులను తిరిగి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆదర్శ రైతులు సాయాగౌడ్, కిషన్, అశోక్, శంకర్‌రావు, వెంకటేశం, డప్పు సాయిలు, స్వామిగౌడ్, కత్తూరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



గండిమాసానిపేటలో రైతు పొలం బాట నిర్వహిస్తున్న విద్యుత్ శాఖాధికారులు



దోమకొండలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్: రైతులు బోరు మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏడీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం గండిమాసానిపేటలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు విద్యుత్ సమస్యలు ఏమున్నా అధికారులకు సమాచారం అందించి పనులు చేయించుకోవాలని అన్నారు. స్వతహాగా ఎలాంటి విద్యుత్ పనులు చేసి ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. ఫోర్‌మెన్ గంగాధర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సిద్దేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్‌శాఖ డీఈ కల్యాణ్ చక్రవర్తి, రైతులతో మాట్లాడారు. రైతులకు విద్యుత్తుపైన అవగాహన కల్పించారు. రక్షణ చర్యల గురించి వివరించారు. తగు జాగ్రత్తల గురించి వారికి తెలియజేశారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ దీపిక, ఫోర్‌మెన్ ఏలం, లైన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా మూలమలుపు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రం నుంచి కాటేపల్లి వైపు వెళ్లే దారిలో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూలమలుపు వద్ద ముళ్లపొదలు ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారింది. మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

వదంతులు నమ్మొద్దు



మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఫ్లెక్సీల దహనం వదంతులను నమ్మవద్దని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని స్థానిక జంబి హనుమాన్ ఆలయం వద్ద మాట్లాడారు. కొంత మంది సోషల్ మీడియాలో లింగంపేటలో ఉద్రిక్తత, భారీగా మోహరించిన బలగాలు అనే శీర్షికలతో పోస్టులు పెట్టినట్లు గుర్తించామన్నారు. అలాంటి వార్తలు సోషల్ మీడియాలో రావడం బాధాకరమన్నారు. ఫ్లెక్సీలు, పైపులు కాలిపోయినది వాస్తవమే అయినప్పటికి ఘటనకు గల కారణాలు విశ్లేషించాల్సి ఉందని, లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్సై అరుణ్‌కుమార్, ఏఎస్సై ప్రకాష్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేప పిల్లల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఎంపీడీవో నరేష్ పలు గ్రామాల మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేశారు. 15 సొసైటీల పరిధిలోని 63 చెరువులకు 8 లక్షల 50 వేల చేప పిల్లలు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. చేపల సంరక్షణ మత్స్యకారులదేనన్నారు. మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు దాసరి సాయికుమార్, శబరి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్, జిల్లా మత్స్య పరిశ్రమ శాఖ క్షేత్ర సహాయకుడు సురేష్, పాల్గొన్నారు.

పరిశోధనలను ప్రోత్సహించాలి



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీలో పరిశోధనలను ప్రోత్సహించాలని కోరుతూ డాక్టరేట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాహుల్ తదితరులు వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావుకు సోమవారం వినతి ప్రతం అందజేశారు. విద్యార్థులకు స్వయం ఉపాధిని కల్పించే నూతన కోర్సులను యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అనంతరం వైస్ చాన్సలర్‌ను సన్మానించారు.

పురస్కారం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ఏడాది కాలంలో 3,500 యూనిట్ల రక్తం సేకరించినందుకు హైదరాబాద్ తలసేమియా సొసైటీ అందజేసిన పురస్కారాన్ని సోమవారం ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు అప్పగించినట్లు కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు బాలు తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం శ్రీనివాస్ గుప్తా విశేష కృషి చేస్తున్నారని బాలు అన్నారు.

శ్రమదోపిడీని అరికట్టాలి



ఎల్లారెడ్డి: శ్రమదోపిడీని అరికట్టాలని సబ్‌స్టేషన్ ఆర్టిజన్ కార్మికులు సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్ల ఆర్టిజన్ కార్మికులకు ప్రతి రోజు 8 గంటల చొప్పున నెలకు 240 గంటల పాటు పని చేయాల్సి ఉండగా నెలకు 15 రోజుల పాటు విధులు నిర్వర్తించినప్పటికి జీతంలో కోత విధిస్తున్నారని అన్నారు. అధికారులు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరికాదని అన్నారు. నిబంధనల ప్రకారం 8 గంటల డ్యూటీని అమలు చేయాలని అన్నారు. నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, రాజాగౌడ్ తదితరలున్నారు.

చెరుకు క్రషింగ్ ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గాయత్రి కర్మాగారంలో సోమవారం చెరుకు క్రషింగ్‌ను ప్రారంభించారు. కర్మాగారం వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు, కేన్ మేనేజర్ వెంగల్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. చెరుకు పంట పండించిన రైతులు కర్మాగారానికి చెరుకును తరలించి క్రషింగ్‌కు సహకరించాలన్నారు. సీడీసీ చైర్మన్ షాదుల్లా, సీడీసీ మెంబర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం తథ్యం



బాన్సువాడ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. సోమవారం ఆయన దెగ్లూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నివర్తిరావు కాంబ్లేను మర్యాదపూర్వకంగా కలిశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో వచ్చిన ఫలితాలే మహారాష్ట్రలో రానున్నాయని ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి మహారాష్ట్ర ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు.

క్యాన్ల పంపిణీ

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి తండాలో మిల్క్ ప్రొడ్యూసర్ ఇనిస్టిట్యూషన్(ఎంపీఐ) ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ డెయిరీ మేనేజర్ పి.సాయికుమార్ పాడి రైతులకు మిల్క్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి పెంచాలని కోరారు. సూపర్‌వైజర్ కె.రాకేష్, ప్రెసిడెంట్ బూక్యా రవి, సెక్రటరీ విస్లావత్ గణేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీసీ కాలనీ పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ కాలనీని మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, కౌన్సిలర్ మహేశ్వరితో కలిసి పరిశీలించారు.రెండు రోజుల్లో కాలనీలో మురికి కాలువ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఏఈ వినోద్, కాంగ్రెస్ నేతలున్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

ఎల్లారెడ్డిరూరల్: సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని 8, 9, 10వ వార్డుల పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమీషనర్ శ్రీహరిరాజు, ఏఈ వినోద్, కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులులున్నారు.

సమగ్ర సర్వేపై అవగాహన

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేటి మధ్యాహ్నం 2 గంటలకు సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు, గ్రామ కార్యదర్శులు, కారోబారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మేనూర్ పశువైద్యుడిగా సయ్యద్ యూనస్

మద్నూర్(జుక్కల్): మేనూర్‌లోని ప్రైమరీ వెటర్నరీ సెంటర్ పశువైద్యుడిగా సయ్యద్ యూనస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాడి పశువుల వైద్యం కోసం అందుబాటులో ఉంటానని అన్నారు.

అంగన్‌వాడి సెంటర్‌లో వైద్య పరీక్షలు

పిట్లం(జుక్కల్): చిల్లర్గి అంగన్‌వాడి సెంటర్‌లో సోమవారం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడి సూపర్ వైజర్ శాంతి శ్రీ వైద్య పరీక్షల కార్యక్రమాన్ని, వీఎస్ఎన్డీ ప్రోగ్రాంను పరిశీలించారు. వైద్యాధికారి తేజరావ్, ఏఎన్ఎం సుశీల, ఆశాలు సునీత, మంజుల, లక్ష్మి, అంగన్‌వాడి టీచర్ శోభ, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

మాచారెడ్డి: ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మహాసభలను డిసెంబర్ 1, 2 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహిస్తామని, మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం మాచారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, హెచ్‌ఎం వెంకటాచారి ఉన్నారు.

సాందీపని డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ క్విజ్‌లు

కామారెడ్డి అర్బన్: స్థానిక సాందీపని డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయ స్థాయి గణితం, గణాంకశాస్త్రం రాత పరీక్ష, క్విజ్ పోటీలు నిర్వహించగా 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. రాత పరీక్ష, క్విజ్ పోటీలను విశ్వవిద్యాలయం అకడమిక్ కన్సల్టెంట్ సందీప్ పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, అకడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్, మ్యాథ్స్, అధ్యాపకులు రాజేందర్, రాజు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రాజంపేట: మండలం కేంద్రంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ వ్యాధి టీకాలను పశు వైద్యాధికారి అనిల్ రెడ్డి వేశారు. పశువులకు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని పాడి రైతులకు సూచించారు. పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899